క్లుప్తంగా

నేడు, రేపు ఎఫ్‌ఏలకు శిక్షణ

వీరఘట్టం: వీరఘట్టం, పాలకొండకు చెందిన ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు బుధవారం మండలంలోని మూలలంక గ్రామంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు. వేతనదారులకు గరిష్ఠ వేతనం రూ.300 లు రావాలంటే వేతనదారులు ఎంత పనిచేయాలి, వారు చేసిన పనిని ఏ విధంగా కొలతలు వేయాలి తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. రెండు మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు విధిగా ఉదయం 10 గంటలకు మూలలంక గ్రామానికి చేరుకోవాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు



పట్టుబడిన సారా, సీజ్ చేసిన బైక్‌తో పోలీసులు

వీరఘట్టం: మండలంలోని వండువ జంక్షన్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోదా చేశారు. అతని బ్యాగులో 20 లీటర్ల సారా పట్టుబడింది. సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కళాధర్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్‌కు ఎఫ్‌ఏసీ సీడీపీవోగా ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీవోగా పనిచేసిన సీహెచ్ సుశీలాదేవికి నెల్లూరు ఏపీడీగా బదిలీ కాగా, ఆ స్థానంలో రాజ్యలక్ష్మిని బదిలీ చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ సేవలు మెరుగుపరుస్తామన్నారు.


వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందిస్తున్న సీఆర్‌పీలు

గుమ్మలక్ష్మీపురం: తమను రెగ్యులర్ ఉద్యోగులు పరిగణించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష సీఆర్‌పీ(సీఆర్‌ఎంటీ)లు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ కలిగిన తామంతా 14 ఏళ్లుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్నామని, అయితే తమకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు-2ను తమకు వర్తింపజేయాలని, మరణించిన సీఆర్‌పీల కుటుంబంలో ఒకరికి కారుణ్యనియామకం ద్వారా ఉద్యోగం ఇప్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని, మొబిలిటీ గ్రాంటు, వయో పరిమితి పెంచాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తమ డిమాండ్లు తీసుకువెళ్లాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఎస్.కాంతారావు, ఎ.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల అర్హతల పరిశీలన



దివ్యాంగుల అర్హతలపై ఆరాతీస్తున్న వైద్యబృందం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి, పెద్దూరు, ఉల్లిభద్ర గ్రామాల్లోని దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారి(పింఛన్‌దారులు) అర్హతలను వైద్యబృందం మంగళవారం పరిశీలించింది. వైద్యులు రవికుమార్, నర్సింగరావులు గ్రామగ్రామానికి వెళ్లి, పింఛన్‌కు వారు అర్హులేనా.. వారి అర్హత తెలిపే ధ్రువపత్రాలను నిశితంగా గమనించి, ధ్రువీకరించారు. అలాగే కొత్తగా పింఛన్ కోసం వేచి చూస్తున్న దివ్యాంగుల అర్హతలపై కూడా ఆరాతీస్తున్నారు. అనర్హులు పింఛన్ డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ తరహా పరిశీలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో వైద్యాధికారి కె.కె. సాగర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా డివైడర్

- గత ఎనిమిది నెలల్లో 10 రోడ్డు ప్రమాదాలు
- అన్నీ సెల్ఫ్ యాక్సిడెంట్లు కావడంతో నమోదు కాని కేసులు
- వీరఘట్టం ప్రధాన రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు
- రోడ్డుకి ఇరువైపుల మురుగు కాలువలపై వేయని సిమెంటు పలకలు
- తరచూ కాల్వలో పడి ప్రమాదాల బారిన పడుతున్న వృద్ధులు, చిన్నారులు



వీరఘట్టం ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న డివైడర్

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన డివైడర్లు ప్రమాదకరంగా మారాయి. సుమారు రూ.5.50కోట్ల వ్యయంతో 8 నెలల క్రితం నిర్మించిన ఈ రహదారి ప్రస్తుతం ప్రమాదాలకు అడ్డాగా మారింది. వట్టిగెడ్డ బ్రిడ్జి సెంటర్ నుంచి పాలకొండ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వరకు సుమారు ఒక కిలోమీటరు వరకు ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. రహదారి మధ్యలో కాంక్రీటు డివైడర్లు ఏర్పాటు చేసారు. ఈ డివైడర్లు రాత్రి పూట ప్రయాణించే వాహనదారులకు కనిపించకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రూ.కోట్లు ఖర్చుపెట్టి రోడ్లు వేసిన అధికారులు డివైడర్లకు రంగులు వేయకపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

ఎనిమిది నెలల్లో పది ప్రమాదాలు

వీరఘట్టం ప్రధాన రహదారి నిర్మించి నేటికి 8 నెలలు కావస్తుంది. ఈ రోడ్డు మధ్యలో వేసిన డివైడర్లను వాహనాలు ఢీకొట్టి ఇంతవరకు 10 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాలన్నీ అర్ధరాత్రి పూట జరిగినవే. దూర ప్రాంతాల నుంచి రాత్రి పూట వచ్చే వాహనదారులకు ఈ డివైడర్‌లు కనిపించకపోవడంతో వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. అయితే ఇంతవరకు జరిగినవన్నీ సెల్ఫ్ యాక్సిడెంట్లు కావడంతో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

నిబంధనలు బేఖాతరు

ఒక రహదారి నిర్మించేటప్పుడు మలుపులు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. డివైడర్‌లకు రేడియమ్ రంగు వేయాలి. పాఠశాలలు, కళాశాలలు ఉన్న చోట స్కూల్ జోను అనే బోర్డులు ఏర్పాటు చేయాలి. దారి పొడవునా మధ్యలో తెల్లటి రేడియమ్ కలర్ వేయాలి. అయితే అధికారులు రోడ్డు వేసి డివైడర్లు నిర్మించారే తప్ప పై నిబంధనలు ఏవీ పాటించకుండా అర్ధాంతంగా రోడ్డును వదిలేసారు. దీంతో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి.

అరకొర మురికికాలువ పనులు..

రోడ్డు నిర్మాణం చేట్టారే తప్ప రోడ్డుకు ఇరువైపుల ఉన్న కాలువలపై సిమెంటు పలకలు వేయాల్సి ఉంది.అయితే అరకొరగా సిమెంటు పలకలు ఏర్పాటు చేసి వదిలేసారు.దీంతో కాలువలపై పలకలను లేని పలుచోట్ల వద్దులు,చిన్నారులు కాలువలలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.ఇప్పటికైనా ఆర్ అండ్‌బి అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వీరఘట్టం ప్రధాన ర హదారి పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు ఏమన్నారంటే..

ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ జె.ఈ కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా డివైడర్లకు రంగులు వేసేందుకు స్కూల్ జోన్లు వద్ద బోర్డులు పెట్టేందుకు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు గత అంచనాలో ప్రతిపాదించ లేదన్నారు. ప్రస్తుతం డివైడర్లకు రంగులు వేసేందుకు మిగులు పనులు చేపట్టేందుకు నిధులు కొరత ఉందని ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ప్రమాదకరంగా డివైడర్లు



వీరఘట్టం ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్లు పమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు డివైడర్లు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి డివైడర్లకు రేడియమ్ కలర్ వేయించాలి.

– బి.సాయికృష్ణ, వీరఘట్టం

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రధాన రహదారి నిర్మించిన ప్పటికీ అగ్రహారం వీధి జంక్షన్ వద్ద, పెరుగువీధి జంక్షన్ వద్ద ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నాయి. ఇక్కడ స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే రోడ్డు పనులు పూర్తయినప్పటికీ విద్యా సంస్థల ప్రాంగణంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వెంటనే వీటిని ఏర్పాటు చేయాలి.

– ఎ.రమేష్, వీరఘట్టం

మోడల్ స్కూల్‌లో సామాజిక తనిఖీ



భామిని మోడల్ స్కూల్ నిర్వహణ, సౌకర్యాలు, నిర్మాణాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీఎంసీ చైర్మన్ పి.రవికుమార్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ నిర్వహణ, ఆహార నిల్వలు, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. బృందంలో సోషల్ ఆడిట్ టీం ఎస్‌ఆర్‌పీ డి.దాస్, డీఆర్‌పీలు వరాహమూర్తి, బి.శ్రీను ఉన్నారు. అనంతరం గ్రామస్తులతో సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

– భామిని

హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని గొట్టివలస జంక్షన్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. చాలాచోట్ల రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేని కారణంగానే ద్విచక్ర వాహనదారులు మరణిస్తుండడం బాధాకరమన్నారు. పండగ వేళ అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

–గరుగుబిల్లి

పండగ నేపథ్యంలో తస్మాత్..: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. సంక్రాంతి పండగ సంతోషంగా చేసుకోవాలని కోరారు. జూదం, గంజాయి, కోడి పందెలు వంటి వాటికి జోలికి పోకుండా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది కేవలం ప్రజల బాగు కోసం మాత్రమే చెబుతున్నామని గుర్తించాలని తెలిపారు. పండగ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఇంటికి తాళం వేస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఆయనతో పాటు ఎస్‌ఐ ప్రయోగమూర్తి ఉన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈవో తిరుపతినాయుడు

గరుగుబిల్లి: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని డీఈవో నల్ల తిరుపతినాయుడు కోరారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సహా కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిసరాల పరిశుభ్రత, రికార్డులు, సిబ్బంది పనితీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు నైతిక విలువలూ నేర్పించాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతిఒక్కరూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శృతి, కురుపాం ఏఎస్‌ఐ వి.రమణలు సూచించారు. కురుపాం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మాదక ద్రవ్యాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. సెట్విజ్ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో మెలగి, ఉన్నతమైన జీవనం సాగించాలని తెలిపారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉత్తమ విద్యార్థులు, వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని, బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురికావద్దన్నారు. అనంతరం పలువురు ఉత్తమ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్‌గోవింద, ఉపాధ్యాయులు ఎం.జగదీష్, యస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్ పాల్గొన్నారు.

సాగుపై సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భామిని: ఇరవై నుంచి 30 సంవత్సరాలు దాటిన జీడి చెట్ల కొమ్మలు తొలగించి, మంచి దిగుబడినిచ్చే రకాల అంట్లు కట్టించి జీడి పంటలో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోవగూడ, పోలవరంలో ఎంఏఓ కె.సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మలు నరికి అంటు కట్టే పద్ధతి ద్వారా వయసు మళ్లిన చెట్లు తొలగించాల్సిన అవసరం లేదన్నారు. సీతంపేట ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీరో టిల్లేజ్‌లో మొక్కజొన్న నాటుకొనే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు దుర్గాప్రసాద్, నాగరాజు, భవాని, ఈశ్వర్, తేజ, జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీపై వ్యాఖ్యలు గర్హనీయం



కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: ఏఐసీసీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంకగాంధీపై ఢిల్లీ బీజేపీ నేత రమేష్ బిదూడీ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఇదే విషయమై ఆయన గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన కల్లు తాగిన కోతిలా మాట్లాడడం సరికాదన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రియాంకగాంధీ బుగ్గల్లా రహదారులను తీర్చిదిద్దుతామని ఆయన మాట్లాడడం సరికాదన్నారు. ఆయన మాటలు ప్రియాంకగాంధీనే కాదు.. యావత్తు మహిళా జాతినే కించపరిచినట్లు అని అన్నారు. ఆయన చేసిన పొరపాటుకు బదులుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు నేరం

పాలకొండ: బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని పార్వతీపురం మన్యం జిల్లా లీగల్ కంప్రొహెషన్ అధికారి పి.శ్రీధర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహలు, బాలల హక్కులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కలిగించారు. బాలల సంరక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్లు ఆర్.హరికృష్ణ, తోట ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీపై ఆందోళన వద్దు

గరుగుబిల్లి: హెచ్‌ఎంపీవీ(హ్యూమన్ మెటానిమో) వైరస్‌పై ఆందోళన వద్దని స్థానిక వైద్యాధికారి కె.కె.వర్మ అన్నారు. గత కొన్నిరోజులుగా చైనాను వణికిస్తున్న వైరస్.. ప్రస్తుతం మనదేశంలోని కర్ణాటక, తదితర రాష్ట్రాల్లోకి వచ్చినట్లు వస్తున్న వార్తలతో ప్రజలు భయపడుతున్నారన్న విషయం తెలుస్తోందని, అయితే ఎవరూ భయపడవద్దన్నారు. రాష్ట్రంలో వైరస్ జాడలు లేవని, ప్రజలంతా ధైర్యంగా ఉండొచ్చన్నారు.


యాజమాన్య పద్ధతులు పాటించాలి



మజ్జిగ ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయి సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని, అలా చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎంఎంఎల్‌టీ వై.గణేష్‌శరత్‌చంద్ర తెలిపారు. మండలంలోని తాడికొండ రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు జీడిమామిడి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు-వాటి ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో పుల్లని మజ్జిగ ద్రావణం తయారు చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డాకుల కుసుమమ్మ, వీఏఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా తరచూ నిర్వహిస్తున్న జాబ్ మేళాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలలో 26 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. జవహర్ నాలెడ్జ్ కేంద్రం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు పాలకొండ కళాశాలలో నిర్వహించటం మంచి పరిణామమని వాణిజ్య శాస్త్ర విభాగం అధిపతి, జేకేసీ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, కె.శ్రీనివాసరావు, బి.గురవయ్య తదితరులున్నారు.

ఉపాధి పనులు ముమ్మరం



ఈసీలో పాల్గొన్న ఉపాధి ఏపీఓ తులసీదాస్, సిబ్బంది

భామిని: రానున్న ఆరు నెలల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలని పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర కమిషనర్ ఎం.కృష్ణతేజ మంగళవారం నిర్వహించిన ఈసీలో అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈసీలో ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్, ఈసీ వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనుల జోరు పెంచి ఫిష్ పాండ్, అమృత సరోవర్, చానల్స్, కెనాల్ లైన్ ప్లాంటేషన్, గోకులం, ఫార్మ్ పాండ్స్, కందకాలు, బెంచ్ టెర్రసింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణకు హాజరైన వారితో ఎంపీడీవో ఉమామహేశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఉపాధి హామీ పథకం సిబ్బందికి సీఆర్‌డీఏ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి కోరారు. కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి వీసీ(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె మంగళవారం హాజరై, పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల మేర పనులు చేయించడం, జాబ్‌కార్డుల మంజూరు, వేతనదారులకు పనుల కల్పన వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నారన్నారు. శిక్షణలో నేర్చుకునే అంశాలను బాగా నేర్చుకుని, పకడ్బందీగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పి.బావాజీరావు తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్ తయారు చేయాలి



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రాలు)ల ద్వారా వర్మీకంపోస్ట్ ఎరువు తయారు చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని కొత్తూరు గ్రామ ఎస్‌డబ్ల్యూపీసీని ఆమె మంగళవారం సందర్శించి, అక్కడ ఎరువు తయారీపై ఆరాతీశారు. ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించి, తయారు చేసిన ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.రజని, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రజారోగ్య నర్సింగ్ అధికారిణి ఉషారాణి

కొమరాడ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని ప్రజారోగ్య నర్సింగ్ అధికారిణి ఉషారాణి అన్నారు. మండలంలోని కొమరాడ, కేఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలికలు, మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. చిన్నారులకు టీకాలు సకాలంలో వేయాలని, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.